ఏఎన్‌యూని అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

వీసీ ఆచార్య పి. రాజశేఖర్



ఏఎన్‌యూ: ఏఎన్‌యూని అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. 2019 నవంబర్ 4న వైస్ చాన్సలర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లలో తాను సాధించిన విజయాలు యూనివర్సిటీలోని అందరి వల్లే సాధ్యం అయ్యాయని తెలిపారు. నాలుగేళ్ల ప్రస్థానంలో 108 గ్లోబల్, 59 నేషనల్ ర్యాంకులను ఏఎన్‌యూ సాధించిందని వెల్లడించారు. కార్యక్రమంలో రెక్టార్ పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, ప్రిన్సిపాల్స్ పి. జాన్సన్, పి. సిద్ధయ్య, ఈ. శ్రీనివాసరెడ్డి, ప్రమీలారాణి, సీడీసీ డీన్ కె. మధుబాబు, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ బి. నాగరాజు, పరీక్షల కో–ఆర్డినేటర్ సంధ్యా కోలే, పలువురు అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల గణనతో అన్ని వర్గాలకు సమ న్యాయం

నెహ్రూనగర్: రాష్ట్రంలో సమగ్ర కుల గణన ఈ నెలలో జరుపుతామని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడం హర్షించదగ్గ విషయమని బీసీ మహాజన సభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు నగర్‌లోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈనెల 21వ తేదీ తర్వాత సమగ్ర కుల జనగణన చేపట్టాలని నిర్ణయించడం అభినందనీయమని తెలిపారు. కుల గణన ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్

నెహ్రూనగర్: నగరంలోని ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు వ్యర్థాల్ని తప్పనిసరిగా నగర పాలక సంస్థ ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్టీపీ)లోనే అన్‌లోడ్ చేయాలని ఇన్‌చార్జ్ కమిషనర్ పి.వి.కె భాస్కర్ తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నగరంలోని ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకర్ల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా సెప్టిక్ ట్యాంకర్లు వ్యర్థాల్ని నగర పరిధిలో బహిరంగంగా కాల్వల్లో, ఖాళీ స్థలాల్లో వేయకూడదని చెప్పారు. సుద్దపల్లి డొంకలో నగరపాలక సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్టీపీలోనే అన్ లోడ్ చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు అధిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాల్ని వేయడం వల్ల చుట్టుపక్కల వారికి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ప్రతి ట్యాంకర్ యజమాని వివరాలతో నగరపాలక సంస్థలో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు స్పెషలిస్ట్ అనిల్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవీంద్రనాయక్, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్

ఓటర్ల ముసాయిదా జాబితాపై అశ్రద్ధ వద్దు

నెహ్రూనగర్: ఓటర్ల ముసాయిదా జాబితాపై అశ్రద్ధ వద్దని, ప్రత్యేక శిబిరాల్లో అందే దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని బీఎల్‌వోలను డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. నగరంలోని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను శనివారం ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజరి అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని 532 పోలింగ్ బూత్‌ల్లో ఆదివారం కూడా ప్రత్యేక శిబిరాల్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి నూతన ఓటు కోసం అందే దరఖాస్తులు, ఓటర్ కార్డ్‌లో చిరునామా, పేరు, పుట్టిన తేదీ తదితర మార్పులపై అందిన దరఖాస్తులు, అభ్యంతరాల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉండే వారి పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ఓటుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శిబిరాల్లో బీఎల్‌వోల దగ్గర ఉన్న ఓటర్ల లిస్టుని పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌వోలు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, సూపర్‌వైజరి అధికారులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు

భవన నిర్మాణ కార్మికుని మృతిపై కేసు నమోదు

పెదకాకాని: ప్రమాదవశాత్తూ భవన నిర్మాణ కార్మికుడి మృతిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం .. బూర్లె శ్రీనివాసరావు (36) కుటుంబం ఎనిమిదేళ్ల కిందట విజయనగరం జిల్లా నుంచి పనుల నిమిత్తం గుంటూరు వచ్చింది. గత ఐదేళ్లుగా శ్రీనివాసరావు తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఒమేగా ఆసుపత్రి సమీపంలో భవనం నిర్మాణం పనుల్లో భాగంగా పిల్లర్లకు కాంక్రీటు వేస్తూ కాలు జారి కింద పడ్డాడు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

చిత్తశుద్ధి గల నేత 'చదలవాడ'

ప్రభుత్వ విప్ లేళ్ళ అప్పిరెడ్డి

పట్నంబజారు: రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై గుంటూరు అభివృద్ధికి చిత్తశుద్ధితో నడుం బిగించిన నిబద్ధత గల నేత చదలవాడ జయరాంబాబు అని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే చదలవాడ జయరాంబాబు వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు రఘు లక్ష్మీపురం మదర్ థెరిస్సా విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)తో కలసి ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ బలహీనవర్గాలకు చెందిన ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన చదలవాడ ప్రజాసేవపై మక్కువతో రాజకీయాల్లో ప్రవేశించి అంచెలంచెలుగా శాసనసభ్యుడి స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో జయరాంబాబు తనయుడు చదలవాడ రఘు, కార్పొరేటర్లు వంగల హేమలత, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ సుభాని, విగ్రహ కమిటీ సభ్యులు ఫ్రాంక్లిన్, మిరియాల వీరయ్య, ఇక్కుర్తి రాజారావు, కాకుమాను రత్నరాజు, సూదాని మోహన్ రఘురామ్, ఆలపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పిరెడ్డి

నేడు గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డయాబెటిక్ నిరోధక మాసం సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు 'గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరం – శాస్త్రీయ అవగాహన సభ' నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి.సేవకుమార్, పావులూరి రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్.హెచ్.ఓ బిల్డింగ్ లో నిర్వహించే వైద్య శిబిరంలో గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ గుండం శివశ్రీనివాసరెడ్డి పాల్గొంటారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఈసీజీ తీస్తామన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

షాపులో చోరీ

గుంటూరు ఈస్ట్: షాపులో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పండరీపురం 1వ లైనులో నివసించే సాయికుమార్ కిరాణా కొట్టు నిర్వహిస్తుంటారు. శనివారం ఉదయం తెరిచేందుకు వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. సొరుగులోని నల్లపూసల బంగారు గొలుసుతో పాటు రూ. 80వేలు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శివాలయంలో కార్తిక మాస ఏర్పాట్లు

పెదకాకాని: శివాలయంలో కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు తెలిపారు. ఆయన అధ్యక్షతన ఆలయంలో శనివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించి, పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా క్యూలైన్‌లు, పందిళ్ల ఏర్పాటుతో పాటు అన్నప్రసాద వితరణ, ఉచిత ప్రసాదాల పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం అక్టోబరు నెల జమాఖర్చుల ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.